# బీసీ హక్కుల పరిరక్షణకే..
# బీసీ కమిషన్ ఏర్పాటు

- తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్
- కుల సంఘాల నాయకుల నుంచి వినతుల స్వీకరణ



బీసీ సంఘాల నాయకుల నుంచి వినతిపత్రాలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతున్న బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

ఆదిబట్ల, నవంబర్ 21 : బీసీల హక్కుల పరిరక్షణకే బీసీ కమిషన్ ఏర్పాటు చేశారని.. సమాజంలో వెనుకబడిన బలహీన వర్గాల ప్రజలు ఎంత మంది ఉన్నారో తెలిస్తే వారికి అవకాశాలు కల్పించేందుకు ఆస్కారముంటుందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. గురువారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వెనుకబడిన తరగతులు, సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన స్థితిగతులు, వెనుకబాటుతనం, వారికి కల్పించాల్సిన అవకాశాలు తదితరాంశాలపై అధ్యయనం నిమిత్తం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బీసీ కమిషన్ బహిరంగ విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా వివిధ కుల సంఘాలు, వ్యక్తులు, సంస్థల నుంచి విజ్ఞాపనలను స్వీకరించిన అనంతరం నిరంజన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల పరిస్థితులను తెలుసుకొని వారి హక్కుల రక్షణ కోసం కృషి చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ బహిరంగ విచారణలు నిర్వహిస్తున్నదన్నారు. ఇప్పటివరకు 7 విచారణలు పూర్తి చేయగా, ఇది 8వ విచారణ అని పేర్కొన్నారు. ఈ నెల 26 వరకు కమిషన్ బహిరంగ విచారణలు ఆయా జిల్లాల్లో కొనసాగుతాయన్నారు. బీసీలపై ఎక్కడైనా దాడులు జరిగినట్లయితే చర్యలు తీసుకునేందుకైనా బీసీ కమిషన్ వెనుకాడదని స్పష్టం చేశారు.

### సమగ్ర కుల సర్వే చారిత్రాత్మక నిర్ణయం

రాష్ట్రంలో నిర్వహిస్తున్న సమగ్ర కుల గణన సర్వే చారిత్రాత్మక నిర్ణయమని, దీని వల్ల రాష్ట్రంలో జనాభాలో బీసీలు ఎంత మంది ఉన్నారో తెలుస్తుందన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో కోటీ15లక్షల పైచిలుకు కుటుంబాలను రాష్ట్రవ్యాప్తంగా గుర్తించడం జరిగిందన్నారు. 87000 మంది ఎన్యూమరేటర్లు ఇప్పటివరకు ఇండ్లకు వెళ్లి సమాచారాన్ని సేకరిస్తున్నారని, సమగ్ర కుటుంబ సర్వే వివరాలు పూర్తిగా పబ్లిక్ డొమైన్‌లో పెట్టడం జరగుతుందన్నారు. ఈ సర్వేపై కొంత మంది ఉద్దేశపూర్వకంగా ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారన్నారు. సమాజంలో బలహీనంగా ఉన్నవారి అభివృద్ధి కోరుకునేవారికి అందరూ సహకరించాలన్నారు. ఇప్పటివరకు తెలంగాణలో 65 నుంచి 70 శాతం వరకు సర్వే పూర్తయిందని, రంగారెడ్డి జిల్లాలో 79.6 శాతం, మేడ్చల్ మల్కాజ్‌గిరిలో 65.3 శాతం, వికారాబాద్‌లో 74.5 శాతం సర్వే పూర్తి చేయడం పట్ల ఆయన అధికారులను అభినందించారు.

బహిరంగ విచారణలో నేరుగా విశ్వకర్మ, బ్రాహ్మణ, పూసల, రజక, కుమ్మర, కమ్మరి, ఉప్పర, అన్ని కూలాల సంఘాల నాయకులు నేరుగా బీసీ కమిషన్ చైర్మన్‌కు విన్నపాలు అందజేశారు. ఈ బహిరంగ చర్చలో 72 మంది కుల సంఘాల నాయకులు విన్నపాలిచ్చారని తెలిపారు. రెండు సంవత్సరాల తొమ్మిది నెలల కాల పరిమితిలో బీసీ కమిషన్ బీసీలకు న్యాయం చేసేందుకు కృషి చేసిందని ఆయన తెలిపారు. బీసీలకు జనాభాపరంగా రిజర్వేషన్లు కల్పించాలని, క్రీమీలేయర్ తొలగించాలని, ప్రమోషన్లలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, కుమ్మరులకు చెరువు మట్టిని ఉచితంగా ఇవ్వాలని, ముదిరాజులు, కుమ్మరి, బట్రాజ్ తదితర కులాలను బీసీ డీ నుంచి ఏ కి మార్చాలని, రజకులను ఎస్సీలుగా గుర్తించాలని, పిచ్చకుంట్లను పూర్తిగా ఆ పేరు పిలవడం మానేసి వంశరాజ్‌గా మాత్రమే పిలవాలని వినతులు అందజేశారన్నారు. వాటిని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని, బీసీ కమిషన్‌పై ఎలాంటి అపనమ్మకం అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, బీసీ కమిషన్ సభ్యులు జయప్రకాశ్, సురేందర్, బాలలక్ష్మి, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌డీవో శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ప్రభుత్వాలు మారుతున్నా.. బీసీల తలరాతలు మారటంలేదు

రంగారెడ్డి, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వాలు మారుతున్నా.. బీసీల తలరాతలు మారటంలేదని బీసీ ఫ్రంట్ రాష్ట్ర చైర్మన్ గొరిగె మల్లేశ్‌యాదవ్ అన్నారు. బీసీ కమిషన్ కేవలం సిఫార్సులు చేయటమే కాకుండా సిఫార్సుల పరిష్కారం దిశగా అడుగులు వేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో బీసీలు విద్యాపరంగా వెనుకంజలో ఉన్నారని, అందుకోసం బీసీల్లో ఉన్నత విద్యనభ్యసించాలని గతంలో జాతీయ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య ఐదు రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేస్తే నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పదివేల ర్యాంకు నిబంధన తీసుకువచ్చిందన్నారు. కౌన్సిలింగ్‌లో వచ్చిన ప్రతి విద్యార్థికి ఫీజు రీయింర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేసేలా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. బీసీల ఆర్థిక వెనుకబాటుతనం నిర్మూలించడానికి బీసీ కార్పొరేషన్, ఎంబీసీ కార్పొరేషన్, బీసీ కుల ఫెడరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాకముందు కామారెడ్డిలో చేసిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ కమిషన్‌ను కోరారు.

### సమస్యలు పరిష్కరించాలి

అబ్దుల్లాపూర్‌మెట్ : బీసీ కులాలవారీగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరంజన్‌కు బీసీ హక్కుల సాధన సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కేతరాజు నర్సింహ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్యతో కలిసి వినతిపత్రం సమర్పించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకార రిజర్వేషన్లు కల్పించాలని, ప్రస్తుతమున్న 23 శాతం రిజర్వేషన్ బీసీ జనాభాకు సరిపోదని తెలిపారు. వార్షిక బడ్జెట్‌లో ప్రతి వార్షిక సంవత్సరం 50 శాతం బడ్జెట్‌ను బీసీలకు కేటాయించాలని, చట్టసభల్లో పార్లమెంట్, అసెంబ్లీల్లో రిజర్వేషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేసి 5 శాతం జనాభాలేని వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్ల బీసీలు అత్యధికంగా నష్టపోతున్నారని వివరించారు. పారిశ్రామిక పాలసీల్లో అన్ని అంశాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ, ప్లాట్ల కేటాయింపుల్లో కనీసం 50 శాతం బీసీ మహిళలకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కోశాధికారి శ్రీను, నాయకులు నరేందర్, వెంకటయ్య, సదానందంగౌడ్, నర్సింహ, యాదయ్యగౌడ్, ఆనంద్‌గౌడ్, విజయచందంగౌడ్, రామకృష్ణ ఉన్నారు.

### రూ.100 కోట్లతో జంగమ భవనాన్ని నిర్మించాలి

కులకచర్ల : బీసీల్లో వెనుకబడిన వర్గాల్లో జంగమ కులం ఉన్నదని తెలంగాణ రాష్ట్ర జంగమ సమాజం కార్యదర్శి మఠం రాజశేఖర్ అన్నారు. హైదరాబాద్‌లో రూ.100 కోట్లతో జంగమ భవనాన్ని ప్రభుత్వం నిర్మించాలన్నారు. శివాలయాల్లో అర్చకత్వం ఇవ్వాలని తెలిపారు. పౌరోహిత్యం మా వృత్తి అని.. వేద విద్య కోసం వీరశైవ ఆగమ గురుకులాలు ఏర్పాటు చేయాలన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయాల్లో ట్రస్టు బోర్డు మెంబర్లుగా, కార్పొరేట్ చైర్మన్‌లుగా నియమించాలని కోరారు. అత్యున్నత వర్గాల ద్వారా వివక్షతకు గురవుతున్నామని.. ప్రత్యేక చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సమాజమంతా మన కుటుంబమే..

### మల్టీ జోన్-2 ఐజీపీ సత్యనారాయణ



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మల్టీ జోన్-2 ఐజీపీ సత్యనారాయణ

వికారాబాద్, నవంబర్ 21 : సమాజం అంతా మన కుటుంబమే అని భావించి విధులు నిర్వర్తించాలని మల్టీ జోన్-2 ఐజీపీ సత్యనారాయణ తెలిపారు. గురువారం వికారాబాద్ జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రంలో 2024 సంవత్సరం బ్యాచ్‌లోని 271 ఏఆర్ ఎస్సీటీపీసీస్‌ల దీక్షాంత్(పాసింగ్ అవుట్) పరేడ్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రామగుండం నుంచి 119, సిద్దిపేట్ నుంచి 60, కొమురం భీమ్- ఆసిఫాబాద్ నుంచి 58, మహబూబాబాద్ నుంచి 34 మొత్తం 271 మంది ఈ పాసింగ్ ఔట్ పరేడ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధంగా, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ, ప్రజలకు సేవ చేయాలన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాల ద్వారా నియమించబడి, అన్ని అంశాల్లో పూర్తిగా శిక్షణ పొంది శాంతి భద్రతలను సంరక్షిస్తూ, ప్రజల జీవితాలు, ఆస్తులకు రక్షణ కల్పించాలన్నారు. నేరాలు, విధ్వంసాలు జరుగకుండా కాపాడేందుకు ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన వ్యవస్థనే పోలీస్ డిపార్ట్‌మెంట్ అని కొనియాడారు. ప్రజలకు పోలీస్ పరోక్షంగా, ప్రత్యక్షంగా సహాయం చేస్తున్నదన్నారు. పోలీస్ లేని సమాజాన్ని ఊహించలేమని, సమాజంలో నేరస్తులను అదుపులో పెట్టడానికి పోలీస్ డిపార్ట్‌మెంట్ అవసరం చాలా ఉందని పేర్కొన్నారు.

ఎన్నో రకాలైన చాలెంజ్‌లను తట్టుకునేలా, సున్నితంగా, కఠినంగా, క్రమశిక్షణతో ఉండేలా ఈ తొమ్మిది నెలల ట్రైనింగ్‌లో నేర్పడం జరిగిందని తెలిపారు. విధులు నిర్వహించేటప్పుడు సహనం, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, ధైర్యంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అప్పగించిన బాధ్యతలు సక్రమంగా సద్వినియోగం చేసుకొవాలని వివరించారు. ప్రధానంగా ప్రజల రక్షణ మన బాధ్యత అని, వారి హక్కులకు, ఆత్మగౌరవానికి భంగం కలుగకుండా చూడాలన్నారు. సమాజం మొత్తాన్ని మన కుటుంబంగా భావించాలని, ముఖ్యంగా పోలీస్ ఉద్యోగంలో క్రమశిక్షణ అనేది చాల ముఖ్యమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. నిత్యం పని ఒత్తిడి, ప్రతికూల పరిస్థితుల్లో బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది కాబట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఫిట్నెస్ చాలా ముఖ్యమైనదని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీసీ ప్రిన్సిపాల్ మురళీధర్, జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ డీఎస్పీ విజయ్‌కుమార్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఏవో జ్యోతిర్మయి, సీఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో రేణుకాదేవి

# ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

- ఉత్తమ ఫలితాల సాధనకు ప్రణాళికతో బోధన చేయాలి
- ఎఫ్ఎల్ఎన్ శిక్షణా పరిశీలనలో డీఈవో రేణుకాదేవి

తాండూరు, నవంబర్ 21 : ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని వికారాబాద్ జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. గురువారం తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పాఠశాలలో నిర్వహించిన ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అమలుపై ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ సబ్జెక్టులపై విషయ నిపుణులు ఉపాధ్యాయులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యాసామర్థ్యాలను పెంపొందించుటకు ప్రణాళికలను తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో రేణుకాదేవి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యా బోధన చేయాలన్నారు. ముఖ్యంగా వృత్యాంతర శిక్షణలో తెలుసుకున్న విషయాలను పాఠశాలలో విధిగా అమలు చేయాలని సూచించారు. ఉత్తమ ఫలితాల సాధనకు చక్కటి ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలకు అనుగుణంగా నడుచుకుంటూ ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించుటకు తోడ్పాటును అందించాలని సూచించారు. జిల్లాలో అన్ని చోట్ల మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించడం జరిగిందన్నారు. ఎక్కడ సమస్యలున్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులున్నారు.




జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఎంఈవో సర్దార్‌నాయక్

# చెకుముకి పోటీల్లో జిల్లాస్థాయికి విద్యార్థుల ఎంపిక

మాడ్గుల, నవంబర్ 21 : చెకుముకి సైన్స్ సంబురాల్లో భాగంగా గురువారం ఇర్విన్ జడ్పీ పాఠశాలలో పోటీలు నిర్వహించగా వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇర్విన్ జడ్పీ పాఠశాల, మాడ్గుల సెయింట్ మేరీ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను మాడ్గుల ఎంఈవో సర్దార్‌నాయక్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు పర్వతాలు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో చెకుముకి సైన్స్ పోటీలను జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తున్నదన్నారు. నవంబర్ 28న జిల్లాస్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. డిసెంబర్ 14, 15, 16 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు ఆదిలాబాద్‌లో జరుగుతాయని వారు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు దేవయ్య, హెచ్‌ఎంలు బాలనారాయణ, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రెయిన్‌బో పాఠశాల కరస్పాండెంట్ జగన్ విద్యార్థులకు బహుమతులు అందజేసినందుకు ఆయనకు అభినందనలు తెలిపారు.

# అనంతగిరి అనంతుడిదే..

- హిందూ జనశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు లలిత్‌కుమార్



వికారాబాద్, నవంబర్ 21 : హిందువులు నిర్లిప్తంగా ఉన్నా.. ప్రభుత్వం హిందువులకు సహకరించకపోయినా తమిళనాడు తిరుచ్చందూర్, శబరిమలై, ముంబై సిద్ధి వినాయక టెంపుల్ మాదిరిగానే అనంతగిరి పద్మనాభుడి ఆలయం కూడా వక్ఫ్ లాక్కునే ప్రమాదం ఉన్నదని హిందూ జనశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు లలిత్‌కుమార్ హెచ్చరించారు. గురువారం అనంతగిరికి వచ్చిన ఆయన పద్మనాభస్వామి కార్తిక మాస ఉత్సవాల్లో భాగంగా అనంతగిరి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అఖండ భజనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే అధికారికంగా వక్ఫ్ బోర్డుకు దేశవ్యాప్తంగా 9లక్షల ఎకరాల భూమి ఉందని, అయినా ఆశ చావకుండా ఇంకా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను వక్ఫ్ బోర్డు పేరిట కబ్జాలు చేస్తూనే ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పవిత్రమైన అనంతగిరి క్షేత్రంలో ఇల్లీగల్‌గా నిర్మాణాలు జరుగుతున్నా అటవీ శాఖ అధికారులు, పాలకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. జాతర ఉత్సవాల్లో అనంతగిరి పరిరక్షణ సమితి చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలకు సహకరించాల్సిన ఆలయ అధికారులు అడ్డుకోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ నదిగా పిలువబడే ముచుకుందా నదిని హైదరాబాద్‌లో ప్రక్షాళన చేయడం కాదు ముందుగా మూసీ పుట్టిన ఆలయ పుష్కరిణిని బాగు చేయాలన్నారు. ఆలయ అధికారులు వెంటనే పుష్కరిణిని బాగు చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. హిందువులు మొద్దు నిద్ర వీడి ఆలయాన్ని రక్షించుకోవడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో అనంతగిరి పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అలోక్ శుక్లా

# సీసీఐ సిమెంట్ నమ్మకమైనది

### ఢిల్లీ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ అలోక్ శుక్లా

వికారాబాద్, నవంబర్ 21 : ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ సిమెంట్ నమ్మకమైనదని ఢిల్లీ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ అలోక్ శుక్లా తెలిపారు. గురువారం వికారాబాద్‌లో సీసీఐ సిమెంట్ డీలర్, సబ్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీఐ సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్న దేశంలోని సిమెంట్ అవసరాలను తీర్చడానికి 1965లో భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ స్థాపించబడిందన్నారు. దీనికి జిల్లాలోని తాండూరులో మూడు ఆపరేటింగ్ ప్లాంట్లు ఉన్నాయన్నారు. సిమెంట్ అవసరాలను తీర్చడానికి 1987లో తాండూరు తాలూకా కరన్‌కోట్‌లో స్థాపించబడిందన్నారు. ఆర్డినరీ పోర్ట్ ల్యాండ్ సిమెంట్ (ఓపీసీ), పోజ్జోలోనా పోర్ట్ ల్యాండ్ సిమెంట్ (పీపీసీ)తో సహా అన్ని రకాల అధిక నాణ్యతగల సిమెంట్ తయారీ, వినియోగదారులకు విక్రయించడానికి సీసీఐ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ ప్లాంట్ భారతీయ రైల్వేల కోసం కాంక్రీట్ స్లీపర్ల ఉత్పత్తిలో ఉపయోగించే ప్రత్యేక గ్రేడ్ సిమెంట్ అయిన ఓపీసీ 535ను కూడా ఉత్పత్తి చేస్తుందన్నారు. ఈ మార్కెట్లలో సీసీఐని ప్రోత్సహించినందుకు సీసీఐ రిటైలర్లు, డీలర్లకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ శరత్‌కుమార్, రీజినల్ మేనేజర్ ఉమేశ్‌కుమార్‌సింగ్, సీనియర్ మేనేజర్ దివాకర్ శ్రీవాస్తవ, సీనియర్ మేనేజర్ పాండే, మేనేజింగ్ ఆఫీసర్లు వెంకటరాములు, రోహిత్ మిశ్రా, అసిస్టెంట్ ఆఫీసర్లు దేవరాజ్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.



పులుమద్ది గ్రామాన్ని సందర్శించిన టీజీఐఆర్ బృందం

# పులుమద్ది గ్రామం సందర్శన

వికారాబాద్, నవంబర్ 21 : వికారాబాద్ మండల పరిధిలోని పులుమద్ది గ్రామాన్ని రాజేంద్రనగర్‌లోని టీజీఐఆర్ బృందం గురువారం సందర్శించారు. ఈ శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వారు పర్యటించి పలు విషయాలు తెలుసుకున్నారు. గ్రామంలోని ఎస్‌డబ్ల్యూఎం షెడ్, సీసీ రోడ్లు, ఎన్ఆర్ఈజీఎస్ పనులు, నర్సరీ, పార్కు, క్రీడా ప్రాంగణం గ్రామ పరిసరాలు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులతో నిర్వహణ ఎలా చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఏ నిధులతో చేశారనే పలు వివరాలు సేకరించారు. వారి వెంట ఎంపీడీవో వినయ్ కుమార్, ఎంపీవో దయానంద్, ఏపీవో శ్రీనివాస్, ఈసీ నవీన్‌కుమార్ ఉన్నారు.



ముడిమ్యాల్ గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీవో సురేశ్ మోహన్

# పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

### రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్

చేవెళ్ల రూరల్, నవంబర్ 21 : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్ అన్నారు. గురువారం చేవెళ్ల మండల పరిధి ముడిమ్యాల్ గ్రామాన్ని ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ కార్యక్రమంలో భాగంగా సురేశ్ మోహన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ.. ఈ నెల 20 నుంచి డిసెంబర్ 4 వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని.. సంబంధిత అధికారులు, సిబ్బంది అంకితభావంతో పని చేసి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. వీధుల్లో చెత్తాచెదారం తొలగింపు, నర్సరీలను శుభ్రం చేయడం, తడి, పొడి చెత్తను వేరు చేసి సిబ్బందికి అందించేందుకు గ్రామస్తులు సహకరించాలని ఆయన కోరారు. డీపీవో వెంట ఎంపీడీవో హిమబిందు, ఎంపీవో విఠలేశ్వర్‌జీ, ముడిమ్యాల్ గ్రామ మాజీ సర్పంచ్ స్వర్ణలత, స్థానిక నాయకుడు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

# ఎందుకీ పోలీసు నిర్బంధం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- ఫార్మా బాధితులతో మాట్లాడిన వామపక్ష నాయకులు



రోటిబండతండాలో బాధితురాలి నుంచి వివరాలు తెలుసుకుంటున్న వీరభద్రం

కొడంగల్/పరిగి, నవంబర్ 21 : సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పాలన కొనసాగించాలని, సంక్షోభ పాలనతో ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. గురువారం కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలంలోని ఫార్మా బాధిత గ్రామాలతో పాటు పొలాలను సందర్శించి బాధితులతో మాట్లాడి రైతుల ఆవేదన, దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం ముందుగా తెలియజేసి, రైతులతో చర్చించిన తర్వాత నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉండగా.. ముందుగానే నోటిఫికేషన్ ఇచ్చి భూములు స్వాధీనం చేసుకుంటున్నట్లు చెప్పి ఆ తర్వాత సంప్రదింపుల పేరిట రైతులను కలిసేందుకు కలెక్టర్, ఇతర అధికారులు వచ్చారన్నారు. రైతులు తమ భూములు కోల్పోతే బతుకుదెరువు ఆగమవుతుందనే ఆవేశంతో అధికారులపై దురుసుగా ప్రవర్తించారని పేర్కొన్నారు. రైతులకు ప్రభుత్వం నచ్చజెప్పి ఒప్పించి భూములు అప్పగించే విధానాన్ని అవలంబించాలని కానీ బలవంతంగా భూముల సేకరణ చేపడితే రైతుల తరపున పోరాటం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని పరిశీలిస్తే పూర్తిగా నక్సలైట్లు, ఉగ్రవాద ప్రాంతంగా ఉందని, ఎక్కడబడితే అక్కడ పోలీసుల బందోబస్తు, బారికేడ్లతో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పడుతున్న ఇబ్బందులను, ఈ ప్రాంత పరిస్థితులను క్షుణ్ణంగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతామని, ఆయన స్పందిస్తే సరి లేదంటే రైతులకు అండగా నిలిచి రైతు పక్షాన పోరాటం చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పద్మ, న్యూ డెమాక్రసీ రాష్ట్ర నాయకులు, సీపీఐ నాయకులు, జిల్లా సెక్రటరీ విజయలక్ష్మి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య, నాయకులు, జిల్లా కార్యదర్శి మహిపాల్, కార్యవర్గ సభ్యులు, వామపక్ష నాయకులు, రైతులు పాల్గొన్నారు.

### వామపక్ష నాయకుల అరెస్టు



పరిగి పోలీస్‌స్టేషన్ వద్ద వామపక్ష నాయకులు మల్లేశ్, పీర్‌మహ్మద్, వెంకటేశ్

లగచర్లలో వామపక్షాల నాయకుల పర్యటన నేపథ్యంలో గురువారం ఉదయం పరిగిలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు మల్లేశ్, సీపీఐ నాయకులు వెంకటేశ్, పీర్‌మహ్మద్‌లను పోలీసులు అరెస్టు చేసి పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం మధ్యాహ్నం వారిని వదిలిపెట్టారు.



మండల పరిధిలోని అల్మాస్‌ఖాన్‌పేట్‌లో కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వేయర్లు గురువారం అల్మాస్‌ఖాన్‌పేట్‌కు వెళ్లి భూములను పరిశీలించి రైతుల ఆధ్వర్యంలో భూ సర్వేను నిర్వహించారు. – కులకచర్ల, నవంబర్ 21

# పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 21 : ఓయూ పరిధిలోని పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సు రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్టు ఆయన పేర్కొన్నారు.

# హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్ష తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 21 : ఓయూ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల (బీహెచ్‌ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్ష తేదీలను మార్చినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సుల మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు గతంలో ప్రకటించామని, పరీక్షలను అదే రోజు నుంచి నిర్వహిస్తున్నప్పటికీ, వివిధ పరీక్ష తేదీలను మార్చినట్టు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని ఆయన సూచించారు.

# ఎంఈ, ఎంటెక్ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 21 : ఓయూ పరిధిలోని ఎంఈ, ఎంటెక్ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సుల రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి, మూడో సెమిస్టర్ మేకప్ పరీక్ష ఫీజును ఈ నెల 25వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 28 వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూడొచ్చని ఆయన సూచించారు.